teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 390 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | సోమవారం | 3 జూన్ 2024 | పేజీలు : 08 | వెల ' 5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.



## 3 జోన్లుగా విభజించబడునున్న తెలంగాణ

**రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**

హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణను 3 జోన్లుగా విభజన చేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొని ఆయన మాట్లాడారు. హైదరాబాద్ ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న ప్రాంతం అర్బన్ తెలంగాణ అని

మిగతా 2 లో



## అట్టహాసంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**2 ని.ల 32 సెకన్ల అధికారిక గీతాన్ని ఆవిష్కరించిన సీఎం**

**తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే వేడుకలకు హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రాష్ట్ర అధికారిక గీతాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ పదేళ్లలో తెలంగాణ వందేళ్ల విధ్వంసానికి గురైందన్నారు సీఎం రేవంత్ రెడ్డి.**

హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్):తమ ప్రభుత్వం వచ్చాక పాలనను గాడిలో పెట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. రాష్ట్రం 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల్లో ఉందన్న సీఎం తెలంగాణ అభివృద్ధి కోసం గ్రీన్ తెలంగాణ 2050 మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామన్నారు. బిడ్డ ఇంట్లో శుభకార్యానికి రావడానికి సోనియాకు హోదా అవసరమా అని ప్రశ్నించారు సీఎం. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామన్న రేవంత్ రెడ్డి మూసీ

మిగతా 2 లో



## చెమట చిందించిన రైతు కళ్ళలో కన్నీరు



**అకాల వర్షాలతో ఆందోళనలో అన్నదాతలు**

**తడిసి ముద్దవుతున్న పంటలతో అపార నష్టం**

**ఒక్కసారిగా ఆర్థిక చీకట్లోకి నెత్తివేస్తున్న పరిస్థితులు**

**పంట "విత్తే" సమయాన్ని ప్రభావితం చేస్తున్న వర్షాలు**

**నిస్సహాయంగా ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూపులు**

తెలంగాణలో అకాల వర్షాలు వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఊహించని వర్షాలు మరియు ఈదురు గాలుల కారణంగా పంటలకు, ముఖ్యంగా పొలాల్లో ఎండిపోయిన పంటలకు, కల్లాల్లో ఉన్న పంటలకు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న పంటలకు అపార నష్టం వాటిల్లుతున్నది. అకాల వర్షాలు మరియు వడగళ్ల వానల కారణంగా లక్షల ఎకరాలకు పైగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ అకాల వర్షాలతో రైతన్నలకు తేరుకోలేని ఆర్థిక నష్టాన్ని కలిగించడమే కాక కళ్ళముందు ఉన్న పంట చేతిలోకి రాకపోయేసరికి తీవ్ర అప్పుల్లోకి నెత్తివేయబడుతున్నారు. ఈ పరిస్థితి చాలా వరకు పంటలు విత్తే సంప్రదాయ సమయాన్ని ప్రభావితం చేస్తున్నది మరియు నల్ల నేలల్లో నీటి ఎద్దడికి దారితీస్తున్నది. ఫలితంగా పెద్దగా పంట నష్టం జరిగింది.

.. వివరాలు 2లో



## కేంద్ర కేబినేట్ మంత్రులకు రాష్ట్రపతి విందు

**రాష్ట్రపతి భవన్ లో రాత్రి 8 గంటలకు విందు ఏర్పాటు**

**విందులో పాల్గొననున్న కేంద్ర మంత్రులు**

న్యూ ఢిల్లీ, జూన్ 02 (తీన్మార్ న్యూస్): ప్రస్తుత ఎన్డీఏ సర్కారు పదవీ కాలం ముగియనుండటంతో కేంద్ర కేబినేట్ మంత్రులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బుధవారం విందు ఇవ్వనున్నారు. రాష్ట్రపతి భవన్ లో రాత్రి 8 గంటలకు ఈ విందును ఏర్పాటు చేశారు. లోక్ సభ ఫలితాలు వెలువడిన మరుసటి రోజే ఈ డిన్నర్ పార్టీని హోస్ట్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తో పాటు ఇతర మంత్రులు, ముఖ్య నేతలు పాల్గొననున్నారని తెలుస్తోంది.

## టీజీఎస్ఆర్టీసీలో రద్దీకి అనుగుణంగా కొత్తగా 2990 బస్సులు

**దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామన్న ఎండి సజ్జనార్**



**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్తగా 2990 బస్సులను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తామని, అందుకు అనుగుణంగా మూడు వేల ఉద్యోగాలు త్వరలో భర్తీ చేయనున్నామని మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ అన్నారు.**

హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లోని బస్ భవన్ ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరులకు నివాళులర్పించారు. అనంతరం

మిగతా 2 లో

## మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్

**ప్రభాకర్‌రావును కలిసానన్న ఆరోపణలను ఖండించిన హరీష్ రావు**

**రుజువు చేస్తే అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాస్తా**



హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): మంత్రి కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్ ఇచ్చారు. ట్యాపింగ్ కేసులో నిందితుడైన ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నాడని ఆయన్ను కలిసేందుకు హరీశ్‌రావు వెళ్లారని మంత్రి కోమటిరెడ్డి చేసిన ఆరోపణలను ఆయన ఖండించారు. తన కుటుంబ సభ్యులతో కలిసే విదేశాలకు వెళ్లానని స్పష్టం చేశారు. ఎక్కడికి వెళ్లాను ఏ హోటల్‌లో ఉన్నాననే వివరాలు కూడా ఇస్తానని చెప్పారు. తాను అమెరికాలో ప్రభాకర్‌రావును

మిగతా 2 లో



## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ అధికారంలోకి వస్తాం

**దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో కెసిఆర్ వాఖ్యాలు**

హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. అదివారం తెలంగాణ భవన్‌లో జరిగిన తెలంగాణ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొందరు బీఆర్ఎస్‌ను ఖతం చేస్తం అంటున్నరని, 25 ఏళ్ల ప్రస్థానమున్న బీఆర్ఎస్‌ను ఖతం చేయడం ఎవరివల్లా కాదని

మిగతా 2 లో



## ఉద్యమకారులను గుర్తించి ఉంటే కేసీఆరే శాశ్వత సీఎంగా ఉండేవారు

**సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

తెలంగాణ బ్యూరో, జూన్ 02 (తీన్మార్ న్యూస్): ఉద్యమకారుల కష్టాన్ని గుర్తించి ఉంటే తెలంగాణకు కేసీఆరే శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండేవారని, తెలంగాణ ప్రజలను అవమానిచండం వల్లే గత ఎన్నికల్లో ఓడిపోయారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా సీపీఐ ఆఫీస్ లో జెండా ఎగరేసిన ఆయన కేసీఆర్ పై పలు విమర్శలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది ఉద్యమకారులు, విద్యార్థులు అశువులు బాషారని, దాదాపు 1500 మంది

మిగతా 2 లో

## నేటి నుండే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

**ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు**



హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి జూన్ 13వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు అంటే మూడు గంటలు పరీక్ష జరగనుంది. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 51,237మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ఇందులో 31,625 మంది

మిగతా 2 లో



## తీహార్ జైల్లో లొంగిపోయిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

**జూన్ 2తో ముగిసిన మధ్యంతర బెయిల్ గడువు**

న్యూ ఢిల్లీ, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తీహార్ జైల్లో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ లొంగిపోయారు. ఇటీవల లోక్ సభ ఎన్నికలకు ప్రచారం చేసుకునేందుకు

మిగతా 2 లో



## బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ శిక్షణలో గురుకుల సీట్లు సాధించిన తండా పిల్లలు

**సన్మానించి,సత్కరించిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు**

తెలంగాణ బ్యూరో, జూన్ 02 (తీన్మార్ న్యూస్): ఇటీవల వెలువడిన ఏకలవ్య గురుకుల ఎంట్రన్స్ పలితాల్లో కురవి మండలం, కాకులబోడుతండ

మిగతా 2 లో



## మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు పూర్తి

**విజయం సాధించిన బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్ కుమార్ రెడ్డి**

మహబూబ్ నగర్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు పూర్తయింది. ఈ ఎన్నికలో బీఆర్ఎస్ ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ అభ్యర్థి జీవన్ రెడ్డిపై 108 ఓట్ల

మిగతా 2 లో

# చెమట చిందించిన "రైతు కళ్ళలో కన్నీరు"





తెలంగాణ బ్యూరో, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో అనేక జిల్లాలలో ఆదివారం ఈదురు గాలులతో భారీ అకాల వర్షం కురిసింది. దీనితో కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల్లో ఎండపోసిన ధాన్యం తడిచి ముద్దయింది. అంతే కాక మామిడి తోటల్లో, మిరప పంటల్లో, కూరగాయల తోటల్లో తీవ్ర స్థాయిలో కాయలు నెల రాలాయి. ఈ సందర్భంగా రైతులు ఆరుగాలం పండించిన వరి ధాన్యం తీవ్రంగా తడిసి ముద్దయిందని, రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షంతో ధాన్యం తీవ్రంగా తడిచి పంట నష్టం జరుగుతున్నదని, లారీలు రాక అకాల వర్షంతో ధాన్యం తడిసి తీవ్ర నష్టం ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అండగా ఉంటాం అని చెప్తున్నా రైతులకు పంట నష్టం మాత్రం ఆగడంలేదు. వరుస అకాల వర్షాలతో అన్నదాతలు అల్లకల్లోలం అవుతున్నారు. చెమట చిందించిత రైతు కళ్లలో కన్నీరే మిగులుతున్నది. నిస్సహాయంగా నిలిస్తూ ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని పంటలు నష్టపోయిన రైతులు వేడుకుంటున్నారు.

ఆర్థిక ఒత్తిడి: కూరగాయలు మరియు ఇతర పంటలను కోల్పోవడం వల్ల రైతులు ఆర్థిక ఇబ్బందులను ఎందుర్కొంటున్నారు. ఆరుగాలం శ్రమించి అప్పులు చేసి మరీ పంటలు వేసి కాపుగాసి కళ్ళలో వత్తులు వేసుకొని పంట పండిస్తే ఈ అకాల వర్షాలు ఒక్కసారికి రైతులను ఆర్థిక చీకట్లోకి నెట్టివేయడమే కాక వారిని ఆర్థిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి.

ప్రభుత్వ మద్దతు: ఇలాంటి అకాల వర్షాల వల్ల నష్టపోతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలుస్తూ పంట నష్టానికి ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం తప్పక ఉంది. ఈ పరిస్థితులను అత్యవసర నేపథ్యంగా పరిగనించి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రభావిత ప్రాంతాలను సందర్శించి నష్టపోయిన రైతులకు పంట నష్టానికి పరిహారం ప్రకటించాలి.

ఈ సంఘటనలు వాతావరణ అవకతవకలకు వ్యవసాయం యొక్క దుర్బలత్వాన్ని మరియు రైతుల జీవనోపాధి మరియు ఆహార భద్రతపై ప్రభావాన్ని తగ్గించడానికి సమర్థవంతమైన చర్యల అవసరాన్ని ప్రభుత్వం గుర్తించాలి.

## అట్టహాసంగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**మొదటి పేజీ తరువాయి**

సుందరీకరణ పథకం ద్వారా పరివాహక ప్రాంతాన్ని ఉపాధి కల్పన జోన్‌గా తీర్చిదిద్దబోతున్నామన్నారు. తెలంగాణ అవిర్భావ దినోత్సవాల్లో భాగంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జాతీయ జెండా ఎగురవేసిన సీఎం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అందె శ్రీ రచించి కీరవాణి స్వరకల్పన చేసిన జయజయహే తెలంగాణ గీతాన్ని విడుదల చేశారు. ఈ గీతాన్ని జాతికి అంకితం చేశారు సీఎం రేవంత్ రెడ్డి. మొత్తం 2 నిమిషాల 32 సెకన్ల నిడివితో ఈ పాటను రిలీజ్ చేశారు. పాట విడుదల సందర్భంగా రచయిత అందె శ్రీ భావోద్వేగానికి గురయ్యారు. జై తెలంగాణ అంటూ నినదించారు. ఉద్యమ సమయంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆకాంక్షిస్తూ రాసిన ఈ పాటకు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా అందెశ్రీ మార్పులు చేశారు. ఇక ఈ పాటకు కీరవాణి సంగీతం అందించడంతో కొంత వివాదం కూడా నడిచింది. మొత్తంగా జయజయహే తెలంగాణ అంటూ ప్రారంభమయ్యే ఈ గీతం సుఖశాంతుల తెలంగాణ సుభిక్షంగా ఉండాలి ప్రతిదినమది తెలంగాణ ప్రజల కలలు పండాలే జై తెలంగాణ జైజై తెలంగాణ అంటూ ముగుస్తుంది. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. సరిగ్గా 8 గంటలకు శాసనమండలి ఆవరణలో చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి జాతీయ జెండా ఎగరవేశారు. 8గంటల 45 నిమిషాలకు అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్ జెండా ఆవిష్కరించారు. అంతకన్నా ముందు గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలి చైర్మన్ గుత్తాసుఖేందర్‌రెడ్డితో పాటు పలువురు మంత్రులు పాల్గొన్నారు. రాజ్‌భవన్‌లోనూ దశాబ్ది వేడుకలు అట్టహాసంగా సాగాయి. పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం గవర్నర్ రాధాకృష్ణన్ జాతీయ జెండా ఆవిష్కరించారు. ఇక గాంధీభవన్‌లో పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ జెండా ఎగరవేశారు. పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ దీపాదాస్ మున్షితో పాటు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు, సేవాదల్ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మళ్లీ అధికారంలోకి వస్తాం

**మొదటి పేజీ తరువాయి**

వ్యాఖ్యానించారు. తెలంగాణ వస్తుందని ఎవరూ కల కనలేదు. పదిహేనేళ్ల పోరాటం తర్వాత తెలంగాణ వచ్చింది. బీఆర్ఎస్‌ను ఖతం చేస్తామని మాట్లాడుతున్నరు. ఇవన్నీ టెంపరరీ సెట్‌బ్యాక్స్. మళ్లీ మేం అధికారంలోకి వస్తం. అందులో 100శాతం అనుమానం లేదు. 25 ఏళ్ల ప్రస్థానమున్న పార్టీని ఖతం చేయగలరా, పదేళ్లు విపక్షంలో ఉన్న కాంగ్రెస్ ఖతమైందా, ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మనదే అధికారం' అని కేసీఆర్ ధీమా వ్యక్తంచేశారు. అంతకుముందు కేసీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం అమరవీరులకు నివాళులర్పించారు. ఆ తర్వాత మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాడు కాంగ్రెస్ హయాంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుంటే కనీసం నీళ్ల కోసం మాట్లాడినవాళ్లు కూడా లేరన్నారు. పాలమూరులో సభపెట్టి పోరాటం చేస్తే జూరాలకు నీళ్లు వచ్చాయని చెప్పారు. అప్పట్లో కుడి కాలువకు ఫ్రీగా నీళ్లిచ్చి, ఎడమ కాలువకు ఛార్జీలు వసూలు చేసేవాళ్లని తెలిపారు.

## తీహార్ జైల్లో లొంగిపోయిన ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

**మొదటి పేజీ తరువాయి**

సుప్రీం కోర్టు కేజ్రీవాల్ కు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ ను మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆదివారంతో ( జూన్ 2) మధ్యంతర బెయిల్ గడువు ముగియడంతో తిరిగి జైలుకు వెళ్లారు. కాగా అనారోగ్యం కారణంగా తనను ఇచ్చిన మధ్యంతర బెయిల్ ను వారం రోజుల పాటు పొడిగించాలని సుప్రీం కోర్టులో సీఎం కేజ్రీవాల్ పిటిషన్ వేయగా ఆ పిటిషన్ సుప్రీం కోర్టు తోసిపుచ్చింది. కేజ్రీవాల్ ఇంటినుంచి బయలు దేరిన తరువాత మార్గం మధ్యలో రాజ్ఘాట్ వద్ద మహాత్మా గాంధీనికి నివాళులు అర్పించారు. ఆ తర్వాత కన్నాట్ ప్లేస్లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి హనుమంతుడి ఆశీస్సులు పొందారు. లొంగిపోయే ముందు ఆయన ఆప్ పార్టీ కార్యాలయాన్ని సందర్శించి కార్యకర్తలు, పార్టీ నేతలతోచర్చించి ఆ తర్వాత తీహార్ జైలులో లొంగిపోయారు.

## టీజీఎస్‌ఆర్టీసీలో రద్దీకి అనుగుణంగా కొత్తగా 2990 బస్సులు



**మొదటి పేజీ తరువాయి**

టీజీఎస్‌ఆర్టీసీ భద్రతా సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా సజ్జనార్ మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర చరిత్రలో నిలిచిపోయిందన్నారు. మహాలక్ష్మి పథక అమలుకు ముందు ప్రతి రోజు సగటున 45 లక్షల మంది ప్రయాణిస్తే, ప్రస్తుతం రోజుకి సగటున 55 లక్షల మంది రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకంతో పెరిగిన రద్దీకి అనుగుణంగా మరో 2000 కొత్త డీజిల్, 990 ఎలక్ట్రిక్ బస్సులను దశల వారిగా వాడకంలోకి తీసుకురావాలని యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. డీజిల్, ఎలక్ట్రిక్ బస్సులను కలుపుకుని మొత్తంగా 2990 కొత్త బస్సులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయన్నారు. కొత్త బస్సులకు అనుగుణంగా 3 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలని టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ అనుమతితో వాటిని వీలైనంత త్వరగా భర్తీ చేస్తామని వెల్లడించారు.

## మంత్రి కోమటిరెడ్డి ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు కౌంటర్

**మొదటి పేజీ తరువాయి**

కలిసినట్టుగా రుజువు చేస్తే అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాస్తానని హరీశ్‌రావు సవాలు విసిరారు. కోమటిరెడ్డి తన దగ్గర ఉన్న ఆధారాలతో చర్చకు రావాలన్నారు. లేకపోతే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. డేట్, టైమ్ కోమటిరెడ్డి చెప్పాలని, నేను రెడీగా ఉన్నా పాస్‌పోర్టుతో సహా చర్చకు వస్తానని స్పష్టం చేశారు.

## అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి కెసిఆర్ ఆర్థిక సాయం

### అప్పట్లో కేసీఆర్

హైదరాబాద్, జూన్ 02 (తీన్మార్ న్యూస్): తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ తాను ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. తెలంగాణ సాధన కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరుడు కానిస్టేబుల్ కిష్టయ్య కుటుంబానికి కేసీఆర్ మరోసారి ఆర్థిక సాయం చేశారు. కిష్టయ్య ప్రాణత్యాగంతో ఆ కుటుంబానికి అండగా ఉంటానని కేసీఆర్ అప్పట్లో మాట ఇచ్చారు. ఇప్పుడు ఆ మాటను బీఆర్ఎస్ అధినేత నిలబెట్టుకున్నారు. కిష్టయ్య మరణంతో ఆయన కుమారుడు, కూతురిని కేసీఆర్ చదివిస్తున్నారు. ఇప్పటికే ఎంబీబీఎస్ చదివించిన కేసీఆర్ కిష్ణయ్య కుమార్తె ప్రియాంక పీజీ కోర్సు వైద్యవిద్యకి కూడా ఆర్థిక మద్దతు అందించారు. ఎంబీబీఎస్ పూర్తి చేసిన ప్రియాంక ఇప్పుడు పీజీ చదువుకుంటోంది. అయితే, నంది నగర్‌లో కిష్టయ్య కుటుంబాన్ని కలిసిన కేసీఆర్ వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ అమ్మను కష్టపెట్టకుండా చూసుకోండంటూ కిష్టయ్య పిల్లలకు బాధ్యతను గుర్తు చేశారు. అమరుల త్యాగాలతోనే తెలంగాణ ఏర్పడిందని ఆయన పునరుద్ఘాటించారు. కేసీఆర్ మమ్మల్ని ఆదుకుంటూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని, తమను కంటికి రెప్పలా కాపాడుతున్నరని కిష్టయ్య కొడుకు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు. తమ కుటుంబాన్ని ఆదుకున్న కేసీఆర్‌కు కిష్టయ్య కుటుంబం ప్రత్యేకంగా ధన్యవాదాలను తెలిపింది.







## బాధ్యతలు ఆదమరిచి నిద్రిస్తున్న తహశీల్దార్

### సోషల్ మీడియాలో వైరల్ అవుతున్ అధికారి ఫోటో

### ప్రజాపాలనలో నిర్లక్షం గల అధికారులపై చర్యలకు స్థానికుల డిమాండ్




ములుగు, జూన్ 02 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండల రెవెన్యూ శాఖ కార్యాలయంలో అక్కడి తహశీల్దార్ సలీం తన ఛాంబర్లోని కుర్చీలో బాధ్యతారాహిత్యంగా ఆదమరిచి నిద్రపోతున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్గా మారాయి. మండల కేంద్రానికి చెందిన పలువురు ఈ ఫోటోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయాగా వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే తాసిల్దార్, ఆర్ఎ గణేష్ లపై విధి నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా తహశీల్దార్ కార్యాలయంలో నిద్రపోవడం ఏంటని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు ఈ ఘటనపై విచారణ జరిపి నిర్లక్ష్య వైఖరి గల ఇలాంటి అధికారులపై ఉపేక్షించకుండా తగు చర్యలు తీసుకోని ప్రజాపాలన ఉద్దేశ్యానికి ఆయువు పోయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## మహబూబ్ నగర్ ఎమ్మెల్సీ ఉపఎన్నిక ఓట్ల లెక్కింపు పూర్తి

**మొదటి పేజీ తరువాయి**

తేడాతో నవీన్ రెడ్డి విజయం సాధించారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాయ్స్ జూనియర్ కళాశాలలో ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమైంది. మూడు గంటల్లోనే ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు. మొత్తం 1,439 ఓటర్లకుగానూ 1,437మంది స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ నుంచి మన్నే జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ నుంచి నవీన్ కుమార్ రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా సుదర్శన్ గౌడ్ బరిలో ఉన్నారు. ఏప్రిల్ 2వ తేదిన కౌంటింగ్ జరగాల్సి ఉన్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జూన్ 2వ తేదీకి కేంద్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. మహబూబ్ నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా విజయం సాధించారు. దీంతో ఈసీ మార్చి 28న ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించింది. రాష్ట్రంలో అధికార మార్పిడి అనంతరం జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికను బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. పోలింగ్ ముందు వరకు ఇరు పార్టీలు క్యాంప్ పాలిటిక్స్ రసవత్తరంగా సాగాయి. క్రాస్ ఓటింగ్ పై రెండు పార్టీల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. కౌంటింగ్ కోసం మొత్తం ఐదు టేబుళ్లు ఏర్పాటు చేశారు. నాలుగు టేబుళ్లపై 300 ఓట్లు, మరో టేబుల్ పై 237 ఓట్లు చొప్పున లెక్కిస్తున్నారు.



## ఉద్యమకారులను గుర్తించి ఉంటే కేసీఆరే శాశ్వత సీఎంగా ఉండేవారు

**మొదటి పేజీ తరువాయి**

విద్యార్థులు ఆత్మబలిదానం చేసుకున్నారని, ఉద్యమాల్లో పాల్గొని, ఆందోళన సాగించి మాపాలన, మా నీళ్లు మా నిధులు మాకు కావాలనే నినాదాన్ని తీసుకొచ్చారన్నారు. ఉద్యమం వేదికగా రాజకీయ పార్టీ పెట్టుకుంది కేసీఆర్ అని, దాని చుట్టూ అందరం తిరిగి తెలంగాణ సాధించుకుంటే ఆ క్రెడిట్ ఆయనకు దక్కి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అంత కష్టపడి సాధించుకున్న రాష్ట్రాన్ని కేసీఆర్ నిర్లక్ష్యం చేశారని, ఏ లక్ష్యంతో తెలంగాణ వచ్చిందో దాన్ని గుర్తుపెట్టుకొని పాలించి ఉంటే కేసీఆరే శాశ్వత సీఎంగా ఉండేవారని తెలిపారు. ఓడలో ఉన్నప్పుడు ఓడ మల్లన్న ఓడ దిగాక బోడి మల్లన్న అన్నట్లు తెలంగాణ ప్రజలను అవమానించాడన్నారు. 17 మంది క్యాబినెట్ లో ఉంటే అందులో 12 మంది తెలంగాణను వ్యతిరేకించిన వాళ్లనే పెట్టుకుని అహంబావం ప్రదర్శించాడని విమర్శలు చేశాడు. ఇక కేసీఆర్ అవినీతి గురించి చెప్పక్కర్లేదని, అవినీతి, అహంబావం ఉంటే ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండలేరని, అందుకే ప్రజలు పదేళ్లకే పంపించేశారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి యువకుడు గత పాలనను దృష్టిలో పెట్టుకొని, ప్రజావ్యతిరేఖ పాలనకు దూరంగా అందర్నీ కలుపుకొని ముందుకుపోవాలని, ప్రథమ ప్రాధాన్యత రాష్ట్ర అభివృద్ధికి ఇచ్చి తర్వాత చిన్న చిన్న పనులు చేసుకుంటూ పోవాలని నారాయణ సూచించారు.

## బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ శిక్షణలో గురుకుల సీట్లు సాధించిన తండా పిల్లలు

**మొదటి పేజీ తరువాయి**

ప్రాథమిక పాఠశాల (కురవి మండలం) నుండి 3 విద్యార్థులు ఏకలవ్య గురుకుల్ ఎంట్రన్స్ రాయగా 2 విద్యార్థులు సీట్లు సాధించారనీ పిల్లలకు కోచింగ్ ఇచ్చిన బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక సభ్యులు వెల్దంది మదు తెలిపారు. దీనికి సహకరించిన టీచర్ రాజేందర్ సర్ మరియు మాజీ చైర్మన్ వాల్యకి తండా వాసులు మదుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్ లో కూడా పేద పిల్లల కోసం కోచింగ్ ఇస్తాను అని అన్నారు. అనంతరం టీచర్ మదును బెస్ట్ ఫ్రెండ్స్ వ్యస్థాపకులు పులి దేవేందర్ ముదిరాజ్, దండు చిరంజీవి ముదిరాజ్ లు శాలువాతో సత్కరించారు. అనంతరం సన్మాన గ్రహీత మదు మాట్లాడుతూ స్థానిక ఎంఈఓ పూల్ చంద్, కాంప్లెక్స్ హెచ్ఎం వహీద్, మండల నోడల్ ఆఫీసర్ బాలాజీ లతో పాటు మండల ఉపాధ్యాయులకు, స్థానిక తల్లి తండ్రులకు ధన్యవాదాలు తెలిపారు.

## 3 జోన్లుగా విభజించబడునున్న తెలంగాణ

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. ఓఆర్ఆర్ నుంచి రీజినల్ రింగ్‌రోడ్డు ప్రాంతం వరకు సబ్ అర్బన్ తెలంగాణ అని.. రీజినల్ రింగ్ రోడ్డు నుంచి తెలంగాణ సరిహద్దు వరకు గ్రామీణ తెలంగాణగా ఏర్పాటు చేస్తామని సీఎం వెల్లడించారు. మూడు ప్రాంతాల్లోనూ త్వరలో అభివృద్ధి ప్రణాళికలు ప్రకటిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు ఆయన జై తెలంగాణ నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 4 కోట్ల ప్రజల హృదయాలు ఆనందంతో ఉప్పొంగే పర్వదినం ఇది అన్న రేవంత్.. తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవానికి పట్టాభిషేకం జరిగి దశాబ్దం పూర్తయిందని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో ప్రాణాలు అర్పించిన అమరవీరులకు నివాళులు అర్పించారు. ఆరు దశాబ్దాల కల సాకారం చేసిన సోనియాకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## నేటి నుండే పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

**మొదటి పేజీ తరువాయి**

అబ్బాయిలు, 19,612 మంది అమ్మాయిలు ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 170 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 170 మంది చీఫ్ సూపరింటెండ్, 170 మంది డిపార్ట్ మెంటల్ ఆఫీసర్లు, 1300 మంది ఇన్విజిలేటర్లు విధుల్లో ఉండనున్నారు. సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్స్ కూడా ఇప్పటికే విడుదల చేశారు. విద్యార్థులు, ఇన్విజిలేటర్లు పరీక్షా కేంద్రాల్లోకి ఫోన్లు తీసుకుని రాకూడదు. విద్యార్థులు నిర్ణీత సమయంలో పరీక్షా కేంద్రాలకు హాజరు కావాలని సూచించారు.